వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మనసేత్రం

Follow

పేజీలు 8

సోమవారం, ఆగస్టు 12, 2024

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

నేడు దేశవ్యాప్తంగా వైద్యసేవల నిలిపివేత

జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా ఫోర్డా నిర్ణయం

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఆర్‌జీ కార్ వైద్య కళాశాల ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా సోమవారం దేశవ్యాప్తంగా కొన్ని రకాల వైద్య సేవలను నిలిపివేస్తున్నట్లు ఫోర్డా (ది ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్) తెలిపింది. ఈ మేరకు కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు ఆదివారం లేఖ రాసింది. హత్యాచార ఘటనపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని కేంద్ర సహాయ మంత్రి సుకాంత మజుందార్ డిమాండ్ చేశారు. హత్యాచార ఘటనలో అరెస్టైన

- మిగతా 2వ పేజీలో

వరదలకు కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యామ్ గేటు

హొస్పేట: కర్ణాటకలో తుంగభద్ర డ్యామ్ గేటు వరదలకు కొట్టుకుపోయింది. శనివారం రాత్రి హొస్పేట వద్ద చైన్ లింక్ తెగడంతో 19వ గేటు కొట్టుకుపోయింది. దీంతో ఇప్పటి వరకు లక్ష క్యూసెక్కుల మేర నీరు వృథాగా పోయింది. తుంగభద్ర నుంచి 60 టీఎంసీల నీరు వృథాగా పోనుంది. షిమోగలో వర్షాలకు తుంగభద్ర డ్యామ్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. తుంగభద్ర నుంచి సుంకేసుల ప్రాజెక్టుకు లక్ష క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచనలు చేశారు. గేటు మరమ్మతులు చేసే వరకు సుంకేసులకు వరద ప్రవాహం కొనసాగనుంది. వరద ఎక్కువగా ఉండటంతో సహాయక చర్యలకు ఆటంకంగా మారింది. తుంగభద్రలో వరద తగ్గాక అధికారులు మరమ్మతులు చేపట్టనున్నారు.

రెండు రోజుల పాటు దక్షిణ కొరియాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

సియోల్ చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి

అమెరికాలో రూ.31 వేల కోట్ల పెట్టుబడుల సాధన

హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన ముగించుకుని శనివారం రాత్రి దక్షిణ కొరియాలోని సియోల్ నగరానికి చేరుకున్నారు. ఆయన అక్కడ రెండురోజుల పాటు వివిధ దేశ, విదేశీ ప్రతినిధులను కలుసుకోనున్నారు. ఎనిమిది రోజుల పాటు అమెరికాలో జరిగిన పర్యటన విజయవంతమైందని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్ష సమావేశాల ఫలితంగా.. 19 కంపెనీల ప్రతినిధులు తెలంగాణలో రూ.31,532 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చినట్లు పేర్కొంది. రాష్ట్ర ప్రతినిధి బృందం అమెరికాలో దాదాపు 50కి పైగా వాణిజ్య సంస్థలతో సమావేశమైందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, విద్యుత్ వాహనాలు, డేటా సెంటర్లు, ఐటీ, ఎలక్ట్రానిక్ రంగాల్లో పెట్టుబడులు పెట్టే దిశగా పలు సంస్థలు సంసిద్ధత వ్యక్తం చేశాయని తెలిపింది.

కొత్త తెలంగాణను చూపించాం: ముఖ్యమంత్రి

అమెరికా పర్యటనలో తాము అనుకున్న ఫలితాలు సాధించామని సీఎం రేవంత్‌రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రపంచంలో పేరొందిన కంపెనీలతో సంప్రదింపులతో తెలంగాణ ప్రభుత్వం సరికొత్త భాగస్వామ్యానికి నాంది పలికిందని తెలిపారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, కృత్రిమ మేధ నగరం, ఫ్యూచర్ సిటీ నిర్మించే దిశగా తమ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రణాళికలకు అమెరికాలోని

- మిగతా 2వ పేజీలో

తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసేలా సీఎం మాట్లాడవద్దు

భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

హైదరాబాద్: తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా సీఎం మాట్లాడవద్దని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. భారాస హయాంలో రాష్ట్రంలో పెట్టుబడులకు అమరరాజాను ఒప్పించేందుకు కష్టపడ్డామని చెప్పారు. రూ.9500 కోట్ల పెట్టుబడులకు ఆ సంస్థ ముందుకొచ్చిందన్నారు. రాజకీయ విభేదాలతో తెలంగాణకు నష్టం జరగకూడదని చెప్పారు. కార్నింగ్ ప్లాంట్, అమరరాజా కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లిపోతే తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. పెట్టుబడిదారులకు ఇచ్చిన హామీలు రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందనడం సీఎం మానేయాలని వ్యాఖ్యానించారు.

యూట్యూబ్ మాజీ సీఈవో మృతికి సంతాపం

యూట్యూబ్ మాజీ సీఈవో సుశాన్ వొజ్కికి మరణవార్త చాలా బాధ కలిగించిందని కేటీఆర్ అన్నారు. అత్యంత డైనమిక్‌గా ఉండే వొజ్కికి ఎంతో తెలివైన వారని.. ఆమెతో పలు సందర్భాల్లో మాట్లాడటం ద్వారా చాలా నేర్చుకున్నానని తెలిపారు. వొజ్కికి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రాష్ట్రంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ విస్తరణ

ఏఐ ఆధారిత డేటా సెంటర్‌పై చర్చలు

ఏడబ్ల్యూఎస్ ప్రతినిధి బృందంతో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, రాష్ట్ర ఉన్నతాధికారులు

హైదరాబాద్: రాష్ట్రంలో తన డేటా సెంటర్ విస్తరణకు పెట్టుబడులు పెట్టేందుకు అమెజాన్ కంపెనీ ఆసక్తి ప్రదర్శించింది. 'అమెజాన్ వెబ్ సర్వీసెస్(ఏడబ్ల్యూఎస్) డేటా సెంటర్ ప్లానింగ్ అండ్ డెలివరీ' వైస్ ప్రెసిడెంట్ కెర్రీ పర్సన్, కంపెనీ ప్రతినిధి బృందంతో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమావేశమయ్యారు. తెలంగాణలో డేటా సెంటర్ కార్యకలాపాలపై చర్చలు జరిపారు. ఇప్పటికే రాష్ట్రంలో అమెజాన్ కంపెనీ కార్యకలాపాలను విస్తరించింది. ప్రపంచంలోనే ఆ కంపెనీకి చెందిన అతిపెద్ద కార్పొరేట్ భవనం హైదరాబాద్‌లో ఉంది. గత ఏడాది అమెజాన్ డెడికేటెడ్ ఎయిర్ కార్గో నెట్‌వర్క్ 'అమెజాన్ ఎయిర్' ప్రారంభించింది. ఏడబ్ల్యూఎస్‌కు సంబంధించి హైదరాబాద్‌లో మూడు డేటా సెంటర్లు ఇప్పటికే పనిచేస్తున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ ఆధారిత సేవలతో కొత్త హైపర్ స్కేల్ డేటా సెంటర్‌తోపాటు తమ వ్యాపారాన్ని విస్తరించే ఆలోచనలను ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు పంచుకున్నారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. అమెజాన్‌తో చర్చలు విజయవంతమయ్యాయని ప్రకటించారు. ప్రభుత్వం తరఫున తగినంత సహకారంతోపాటు ఉత్తమమైన ప్రోత్సాహకాలు అందిస్తామని వారికి హామీ ఇచ్చినట్లు చెప్పారు. రాష్ట్రంలో భారీ విస్తరణకు కంపెనీ మందుకు వస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. కెర్రీ పర్సన్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో తమ క్లౌడ్ సదుపాయాలను మరింత విస్తరించే అవకాశాలపై సానుకూలత వ్యక్తం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ సేవల వృద్ధికి హైదరాబాద్ కీలకపాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ వృద్ధిలో ఆశించిన లక్ష్యాలను అందుకునేందుకు తమ కంపెనీ భాగస్వామ్యం తప్పకుండా ఉంటుందని చెప్పారు.

యాదాద్రిలో అఖండ దీపారాధన ప్రారంభం

2లో

20 కి.మీ. పరిధిలోనే అందుబాటులో డయాలసిస్ కేంద్రాలు

రానున్న రోజుల్లో వైద్యశాఖలో మార్పులు

మంత్రి దామోదర్ రాజనర్సింహ

మదనాపురం, కొత్తకోట: రానున్న రోజుల్లో ప్రతి పేదవ్యక్తికి ప్రభుత్వ దవాఖానాపై 'ఇది నాది..' అన్న సొంతభావన కలిగేలా వైద్యశాఖలో మార్పులు ఉండబోతున్నాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. అవసరమైన ప్రతి వ్యక్తికీ 20 కి.మీ.ల పరిధిలోనే అందుబాటులో ఉండేలా డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. వనపర్తి జిల్లా మదనాపురం వ్యవసాయ మార్కెట్‌యార్డ్ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆదివారం మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ రహదారులపై ప్రతి 30 కి.మీ. దూరంలో ఎమర్జెన్సీ యూనిట్, వాహనం అందుబాటులో ఉండాలని.. 40 కి.మీ. పరిధిలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. రాష్ట్రంలో సుమారు 70 ట్రామాకేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. క్యాన్సర్‌ను గుర్తించేందుకు మొబైల్ స్క్రీనింగ్ వాహనం ఏర్పాటు చేయనున్నామని.. ఇది ప్రతి గ్రామంలో పర్యటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందన్నారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలో జానంపేట వద్ద ట్రామాకేర్ సెంటర్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

సిద్ధమైన సీతారామ ఎత్తిపోతల

ఏటా 6 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాలనే సంకల్పంతో ఉన్నాం: మంత్రి ఉత్తమ్

ట్రయల్‌రన్‌లో ఎగసిన జలాలు

15న ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఖమ్మం జిల్లా : కృష్ణమ్మ పరవళ్లు తొక్కే నేలకు గోదావరి జత కానుంది. నీరందని చివరి ఆయకట్టులో సిరుల పంటకు తోడు కానుంది. సీతారామ ఎత్తిపోతల పథకంతో సింగరేణి సిరుల నేల తడవనుంది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలోని 9.02 లక్షల ఎకరాలకు సాగు నీరందించేందుకు రూ.18 వేల కోట్ల అంచనా వ్యయంతో (అదనపు పనులతో కలిపి) నిర్మిస్తున్న సీతారామ ఎత్తిపోతల పథకంలో పంపులు, ప్రధానకాలువ, రాజీవ్ లింక్ కాలువ సిద్ధమయ్యాయి. ఆదివారం రెండో పంపుహౌస్ వద్ద ట్రయల్‌రన్‌ను ప్రారంభించగా.. మొదటి పంపు మీట నొక్కగానే గోదావరి జలాలు ఎగిసి పడ్డాయి. దీంతో భద్రాద్రి, ఖమ్మం జిల్లాలు మురిసిపోతున్నాయి.

కృష్ణమ్మకు ఎదురేగి..

సీతారామ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలు కృష్ణా నదికి

- మిగతా 2వ పేజీలో

తమిళనాడులో రోడ్డు ప్రమాదం..

ఐదుగురు తెలుగు విద్యార్థుల మృతి

చెన్నై(తిరుత్తణి): ఏడుగురు స్నేహితులు.. ఒకే కళాశాలలో చదువుకుంటున్నారు. రెండు రోజులు సెలవులు రావడంతో కారులో ఆలయానికి వెళ్లి తిరిగొస్తున్నారు. ఇంతలో లారీ రూపంలో దూసుకొచ్చిన ప్రమాదం.. వారిలో ఐదుగురిని బలి తీసుకుంది. ఈ విషాద ఘటన తమిళనాడులో జరిగింది. మృతులు ఏపీలోని పలు జిల్లాలకు చెందినవారిగా తెలిసింది. చెన్నై సమీపంలోని ఎస్ఆర్ఎం కళాశాలలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న ఏడుగురు విద్యార్థులు శనివారం కారులో తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయానికి వెళ్లారు. స్వామివారి దర్శనానంతరం తిరిగి ఆదివారం రాత్రి చెన్నై బయల్దేరారు. తిరువళ్లూరు జిల్లా కనకమ్మసత్రం సమీపంలోకి రాగానే ఎదురుగా వేగంగా వచ్చిన లారీ వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ప్రమాద తీవ్రతకు కారు నుజ్జునుజ్జయింది.

- మిగతా 2వ పేజీలో

వాయిస్ టుడే
జనగాత్రం - మనక్షేత్రం
హైదరాబాద్
సోమవారం, 12 ఆగస్టు 2024

నేడు దేశవ్యాప్తంగా వైద్యసేవల నిలిపివేత

- మొదటిపేజీ తరువాయి

సంజయ్ రాయ్ పోలీసులకు అనుబంధ వాలంటీర్‌గా పనిచేస్తున్నట్లు తేలింది. దక్షిణ కోల్‌కతాలోని శంభునాథ్ పండిట్ వీధిలో ఉండే సంజయ్.. స్థానిక పోలీస్ విభాగంలో విపత్తుల నిర్వహణ బృందంలో వాలంటీర్‌గా చేరాడు. అతనికి ఆర్‌జీ కార్ వైద్య కళాశాల, ఆసుపత్రి చెక్‌పోస్టు బాధ్యతలు అప్పగించారు. దర్యాప్తు సమయంలో ఎటువంటి పశ్చాత్తాపం వ్యక్తం చేయకపోగా.. తనను ఉరి తీయాలనుకుంటే తీసుకోవాలంటూ.. ఎదురుచెప్పడం గమనార్హం. సంజయ్ రాయ్‌కు ఇప్పటికే నాలుగు పెళ్లిళ్లు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు.

యాదాద్రిలో అఖండ దీపారాధన ప్రారంభం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలోని విష్ణు పుష్కరిణిలో స్నానసంకల్పం, అఖండ దీపారాధన ఆదివారం ప్రారంభమయ్యాయి. నారసింహుడి జన్మ నక్షత్రం స్వాతిని పురస్కరించుకొని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య దంపతులు ఈ క్రతువులను ప్రారంభించారు. దంపతులు రూ.100 టికెట్ ద్వారా అఖండ దీపారాధనలో పాల్గొనవచ్చని ఈవో భాస్కర్‌రావు తెలిపారు. ఆలయం చెంత తిరుమల తరహాలో అఖండ దీపారాధనకు శ్రీకారం చుట్టారు. కొబ్బరికాయల మొక్కు తీర్చుకునేందుకు ప్రత్యేక వేదికను ప్రారంభించారు. గర్భాలయంలో స్వయంభువులైన పంచనారసింహులను కొలుస్తూ అష్టోత్తర శత ఘటాభిషేకం నిర్వహించారు. శ్రావణ మాసం తొలి ఆదివారం కావడంతో భక్తుల సందడి కనిపించింది. ఈవో భాస్కర్‌రావు, ధర్మకర్త నరసింహమూర్తి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



రెండు రోజుల పాటు దక్షిణ కొరియాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

- మొదటిపేజీ తరువాయి

పారిశ్రామికవేత్తల నుంచి భారీ మద్దతు లభించిందని పేర్కొన్నారు. అమెరికా వ్యాపార సామ్రాజ్యానికి తెలంగాణను సరికొత్తగా చూపించామని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ రంగాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలు, ప్రభుత్వం అందించే సహకారాన్ని అమెరికా కంపెనీలకు వివరించామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. అమెరికా పర్యటన సత్ఫలితాలను అందించిందని, రాష్ట్రానికి పెట్టుబడులు, అపారమైన ఉద్యోగావకాశాలు లభిస్తాయన్న ఆశాభావాన్ని మంత్రి వ్యక్తం చేశారు.

తమిళనాడులో రోడ్డు ప్రమాదం.. ఐదుగురు తెలుగు విద్యార్థుల మృతి

- మొదటిపేజీ తరువాయి

ఈకారులో ఉన్న ప్రొద్దుటూరుకు చెందిన నితీష్(21), తిరుపతికి చెందిన యుగేశ్(23), చేతన్(22), కర్నూలుకు చెందిన రామోహ్మన్(21), విజయవాడకు చెందిన బన్ను నితీష్(22) ఘటనాస్థలంలోనే మృతిచెందారు. నెల్లూరుకు చెందిన విష్ణు, ప్రకాశం జిల్లా వాసి చైతన్యకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని తిరువళ్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారులో చిక్కుకుపోయిన మృతదేహాలను పోలీసులు అతికష్టం మీద బయటకు తీసి శవపరీక్షకు తరలించారు.

సిరిసిల్ల నుంచి రాష్ట్రాలకు 'హర్ ఘర్ తిరంగా' జెండాలు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్

హైదరాబాద్: హర్ ఘర్ తిరంగా కార్యక్రమం కోసం తెలంగాణలోని సిరిసిల్ల నుంచి దేశంలో పలు రాష్ట్రాలకు జాతీయ జెండాలను సరఫరా చేస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి తెలంగాణ తపాలా సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ (సీపీఎంజీ) పీవీఎస్ఎన్ రెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రిని ఆయన కలిసి జాతీయ జెండాను అందజేశారు. తెలంగాణ తపాలా సర్కిల్ ద్వారా ఇప్పటికే 6.38 లక్షల జాతీయ జెండాలను అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాలకు సరఫరా చేసినట్లు ఈ సందర్భంగా కిషన్‌రెడ్డికి వివరించారు. ఆగస్టు 15న దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విక్రయాల కోసం రాష్ట్రంలోని 6,267 పోస్ట్ ఆఫీసుల్లో జాతీయ జెండాలను అందుబాటులో ఉంచామన్నారు. వివిధ రాష్ట్రాలకు మువ్వన్నెల జెండాలను సరఫరా చేస్తున్నందుకు సీపీఎంజీని కిషన్‌రెడ్డి అభినందించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 3 లక్షల జాతీయ జెండాల ఆర్డర్ వచ్చినట్లు తెలంగాణ తపాలా శాఖ వర్గాలు తెలిపాయి.

సిద్ధమైన సీతారామ ఎత్తిపోతల

- మొదటిపేజీ తరువాయి

ఎదురేగనున్నాయి. భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం నుంచి ప్రారంభమై పాలేరు జలాశయానికి నీటిని చేర్చాలనేది ఈ ప్రాజెక్టు లక్ష్యం. సాగునీటి సవ్వడి లేని ప్రాంతాలతోపాటు కృష్ణా పరీవాహకంలోని సాగర్ చివరి ఆయకట్టులో తడారిపోయిన పొలాలను గోదావరి జలాలతో తడపనున్నారు. ప్రస్తుతం గోదావరి నుంచి అప్రోచ్ కాలువ, మూడు పంపుహౌస్‌లు, 100వ కిలోమీటరు వరకు ప్రధాన కాలువ, రాజీవ్ లింక్ కాలువ పనులు పూర్తయ్యాయి. వీటి ద్వారా వైరా మార్గంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాలువ కింద ఆయకట్టుకు సాగునీరివ్వనున్నారు.

పనులు పూర్తయిన మార్గం ఇలా..

అశ్వాపురం మండలంలో సీతమ్మసాగర్ ప్రాంతం నుంచి పది కిలోమీటర్ల దూరం అప్రోచ్ కాలువ ద్వారా నీటిని తీసుకుంటారు. మొదటి పంపుహౌస్ ద్వారా 43.30 మీటర్ల నుంచి 67.15 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోస్తారు. ఇక్కడ 25 మెగావాట్ల సామర్థ్యం ఉన్న ఆరు పంపులు ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి 32 కిలోమీటర్ల దూరం వరకు కాలువ ద్వారా నీటిని తరలిస్తారు.

భద్రాద్రి జిల్లా ములకపల్లి మండలం పూసుగూడెం వద్ద ఉన్న రెండో పంపుహౌస్ నుంచి 62.20 మీటర్ల స్థాయి నుంచి 110 మీటర్ల ఎత్తుకు ఎత్తిపోస్తారు. 40 మె.వా. సామర్థ్యం ఉన్న ఆరు పంపులు ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి 59.07 కిలోమీటర్ల వరకు కాలువ ద్వారా నీళ్లు చేరుతాయి.

ములకలపల్లి మండలంలోని కమలాపూర్ వద్ద ఉన్న మూడో పంపుహౌస్ నుంచి 40 మె.వా. సామర్థ్యం ఉన్న ఐదు పంపుల ద్వారా 107.20 మీటర్ల నుంచి 160 మీటర్ల ఎత్తుకు తరలిస్తారు. ఈ పంపుల ద్వారా పాలేరు జలాశయానికి నీళ్లు వెళ్లే కాలువలో ఎత్తిపోస్తారు. మరో 30 మె.వా. రెండు పంపులతో 107.20 మీటర్ల నుంచి 200 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోసి సత్తుపల్లి వైపు వెళ్లే కాలువ ద్వారా తరలిస్తారు.

మూడో పంపుహౌస్ నుంచి పాలేరు మార్గంలో 100.45 కిలోమీటరు వరకు నీటిని తరలిస్తారు. ఇక్కడి నుంచి రాజీవ్ లింక్ కాలువ (ఏన్కూరు లింక్ కాలువ) ద్వారా పాలేరు నుంచి వైరా వైపు వెళ్లే నాగార్జునసాగర్‌కు లింక్ కలుపుతారు. దీనివల్ల మధిర, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల్లోని సాగర్ ఆయకట్టుకు నీరందనుంది. వైరా ప్రాజెక్టు, లంకాసాగర్ నింపుతారు. గోదావరి జలాలతో 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. సాగర్ కింది ఆయకట్టుకు ప్రయోజనం చేకూరుతుంది.

దమ్మపేట మండలం గండుగులపల్లి వద్ద నాలుగో పంప్‌హౌస్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మూడో పంపుహౌస్ నుంచి సత్తుపల్లి మార్గంలో ప్రధాన కాలువ నిర్మించి ఐదు పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తారు.

3.28 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు జలసిరి

సీతారామ ఎత్తిపోతలను మొత్తం 16 ప్యాకేజీలుగా విభజించి చేపట్టగా.. ఇప్పటి వరకు ఎనిమిది ప్యాకేజీల్లోని పనులు పూర్తయ్యాయి. ఈ ఎత్తిపోతల పథకం కింద 3.28 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు ఇవ్వనున్నారు. పనులు పూర్తయ్యేనాటికి ఇది మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

ప్రయోజనం పొందే నియోజకవర్గాలివే..

భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని 10 నియోజకవర్గాల్లో ఆయకట్టుకు సాగునీరు అందనుంది. పాలేరు లింక్ కాలువ ద్వారా డోర్నకల్ నియోజకవర్గంలోని మండలాలకు నీటిని అందించనున్నారు. పినపాక, కొత్తగూడెం, అశ్వారావుపేట, ఇల్లెందు, సత్తుపల్లి, వైరా, మధిర, ఖమ్మం, పాలేరు, డోర్నకల్ నియోజకవర్గాలు జాబితాలో ఉన్నాయి.

'భారాస లేకుండా చేయాలని కుట్ర'

ఫిల్మ్‌నగర్: కాంగ్రెస్, భాజపా ఒప్పందంతో భారాస లేకుండా చేయాలని కుట్ర చేస్తున్నారని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుంకిశాల ప్రాజెక్టు ప్రమాదంపై ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించలేదని, ఏజెన్సీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని కేటీఆర్ కోరినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రాజెక్టు ప్రమాదంపై కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ డిసెంబర్ 9వ తేదీలోపు చేస్తామని చెప్పి ఇప్పుడు అరకొరగా చేస్తున్నారని, రైతు భరోసాపై ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదన్నారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపుతప్పాయని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.

కవితకు బెయిల్ వచ్చేనా..?

నేడు సుప్రీంకోర్టులో విచారణ

జస్టిస్ గవాయ్ ధర్మాసనం ముందుకు దరఖాస్తు

సిసోడియాకు బెయిల్ నేపథ్యంలో

బీఆర్ఎస్ వర్గాల్లో ఆశలు

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌పై సోమవారం సుప్రీం కోర్టులో విచారణ జరగనుంది. తనపై ఈడీ, సీబీఐలు నమోదు చేసిన కేసుల్లో బెయిల్ ఇవ్వాలని కోరుతూ కవిత ఈ నెల 8న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనకు బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు జూలై 1న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్(క్రిమినల్) దాఖలు చేశారు. మద్యం పాలసీ కేసులో కవిత సాక్ష్యాలను ధ్వంసం చేయడంతోపాటు సాక్షులను ప్రభావితం చేయడానికి ప్రయత్నించారన్న దర్యాప్తు సంస్థల వాదనలతో ఢిల్లీ హైకోర్టు ఏకీభవించింది.

"ఢిల్లీ మద్యం పాలసీ కేసులో దర్యాప్తు సంస్థలు దాఖలు చేసిన చార్జ్‌షీట్‌లో 50 మందిని నిందితులుగా పేర్కొన్నాయి. అందులో కవిత మాత్రమే మహిళ. మహిళలకు కొన్ని ప్రత్యేక వెసులుబాట్లను చట్టాలు కల్పించాయి. మహిళా చట్టాలను పరిగణనలోకి తీసుకుని కవితకు బెయిల్ ఇవ్వండి. కవిత విషయంలో దర్యాప్తు సంస్థలు మొదటి నుంచీ చట్టాలను ఉల్లంఘిస్తూనే ఉన్నాయి. అరెస్టు సమయంలో కనీస నిబంధనలు పాటించలేదు. మహిళలకు ప్రత్యేక రక్షణలు ఉన్నాయి.

వచ్చే ఐదేళ్లలో 30 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు

'సీతారామ' ట్రయల్‌రన్‌లో మంత్రి ఉత్తమ్

పాల్గొన్న మంత్రులు తుమ్మల, పొంగులేటి

కొత్తగూడెం: వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో 30 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కృష్ణా, గోదావరి జలాల సద్వినియోగానికి ప్రభుత్వం కృషిచేస్తుందని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు పంప్‌హౌస్ ట్రయల్ రన్‌ను ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మోటార్ స్విచ్ ఆన్ చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులతో కలిసి ఉత్తమ్ విలేకరులతో మాట్లాడారు. ఏటా ఆరు లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. ఈ నెల 15న సీఎం రేవంత్‌రెడ్డి సీతారామ ప్రాజెక్టులోని మూడు పంప్‌హౌస్‌లను ప్రారంభిస్తారని తెలిపారు. రెండేళ్లలో పథకం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందన్నారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రారంభించినా నీటి కేటాయింపులు జరగలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే కేంద్రంతో సంప్రదింపులు జరిపిందన్నారు. తద్వారా ప్రాజెక్టుకు 67 టీఎంసీలను కేటాయించినట్లు చెప్పారు. కృష్ణా పరీవాహకంలో నీరు తగ్గిన సందర్భాల్లో సాగర్ ఆయకట్టులోని సుమారు 1.20 లక్షల ఎకరాలకు సీతారామ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలు తరలిస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. 'ప్రస్తుతం ప్రధాన కాలువ 104 కి.మీ., మూడు పంప్‌హౌస్‌ల నిర్మాణం పూర్తయింది. డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. జూలూరుపాడు వద్ద 1.8 కి.మీ. టన్నెల్ పూర్తయితే పాలేరు జలాశయానికి గోదావరి నీటిని తరలించవచ్చు' అని తెలిపారు. ఈ నెల 15న సీఎం మూడో విడత రైతు రుణమాఫీ చేస్తారని చెప్పారు.

మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి హయాంలో రాజీవ్‌సాగర్ ఎత్తిపోతల ప్రాజెక్టును రూ.2,400 కోట్లతో తలపెట్టినట్లు తెలిపారు. గత భారాస ప్రభుత్వం దీన్ని రీడిజైన్ పేరుతో సీతారామగా మార్చి.. వ్యయాన్ని రూ.18 వేల కోట్లకు పెంచిందని ఆరోపించారు. రూ.8 వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెబుతున్నా ఒక్క ఎకరాకు కూడా నీరివ్వలేదని విమర్శించారు. ములకలపల్లి మండలంలోనే మూడో పంప్‌హౌస్ ట్రయల్‌రన్ కూడా నిర్వహించాల్సి ఉన్నా.. నీరు తగినంత లేక మంత్రులు వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌పాటిల్, ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్, ఇన్‌ఛార్జి సీఈ విజయభాస్కర్, జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ మువ్వా విజయబాబు, డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై ఘోరం..

రైలు ఢీకొని ఇద్దరు కూతుళ్లతో సహా

రైల్వే ట్రాక్‌మెన్ మృతి

భర్త, కన్నబిడ్డలను కళ్లెదుటే కోల్పోయిన భార్య

మేడ్చల్‌లోని గౌడవెల్లి రైల్వేస్టేషన్‌లో దుర్ఘటన

మేడ్చల్ టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పట్టాలపై దూరంగా రైలు వస్తోంది. విధి నిర్వహణలో ఉన్న ఓ ట్రాక్‌మెన్ పట్టాల సమీపంలో పెరిగిన గడ్డిని తొలగిస్తున్నాడు. ఆ ట్రాక్‌మెన్ చిన్న కూతురు.. నాన్నా అంటూ.. తండ్రి కోసం పరిగెడుతూ పట్టాలు దాటుతోంది. ఇది చూసిన ట్రాక్‌మెన్ పెద్ద కుమార్తె చెల్లెలను ఆపేందుకు పరుగెడుతూ కేకలు వేసింది. ఆ అరుపులు విన్న ఆ తండ్రి తన బిడ్డలను కాపాడుకునేందుకు యత్నిస్తుండగా రైలు రూపంలో దూసుకొచ్చిన మృత్యువు ఆ ముగ్గురిని కబళించింది.

మేడ్చల్ జిల్లా కేంద్రంలోని గౌడవెల్లి రైల్వేస్టేషన్‌లో ఆదివారం జరిగిన ఈ దుర్ఘటనలో కృష్ణ(42) అనే ట్రాక్‌మెన్,, అతని కుమార్తెలు వర్షిత(12), వరిణి(7) ప్రాణాలు కోల్పోయారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. గౌడవెల్లి రైల్వేస్టేషన్‌లో ట్రాక్ మెన్‌గా పని చేసే కృష్ణ ఆదివారం విధులు ముగిసిన తర్వాత కుటుంబంతో కలిసి బయటికి వెళ్లేందుకు భార్యాబిడ్డలను రైల్వే స్టేషన్‌కు తీసుకొచ్చాడు. భార్యాపిల్లలను ప్లాట్‌ఫామ్‌పై ఉంచిన కృష్ణ పట్టాల వద్ద పని చేసుకుంటున్నాడు.

మరోపక్క ప్లాట్‌ఫామ్‌పై ఆడుకుంటున్న వరిణి తండ్రిని చూసి అతని వద్దకు వెళ్లేందుకు పరుగు తీసింది. ప్లాట్‌ఫామ్ చివరికి వెళ్లి పట్టాలు దాటే యత్నం చేసింది. గమనించిన కృష్ణ పెద్ద కుమార్తె వర్షిత చెల్లెలను ఆపేందుకు ఆమె వెంట పరుగెత్తింది. మరోపక్క పిల్లలున్న ట్రాక్‌పై రైలు వస్తుండడాన్ని గమనించిన కృష్ణ వారిని కాపాడేందుకు పరుగుతీశాడు. అయితే, ఆ ట్రాక్‌పై సికింద్రాబాద్ వెళుతున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వారిని ఢీకొట్టగా చెల్లాచెదురుగా ఎగిరిపడ్డ ఆ ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. కళ్ల ముందే తన ఇద్దరు పిల్లలు, భర్తను కోల్పోయిన కవిత ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంపై రైల్వే అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

భారతదేశంలోని తొలి కార్పోరేట్ కంటి ఆసుపత్రి

వాసన్ ఐ హాస్పిటల్ తన నూతన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ని హైదరాబాద్ లోని హిమాయత్ నగర్ లో ఈనెల 25న ప్రారంభించనుంది. భారతదేశంలోని 83 నగరాల్లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వహిస్తున్న వాసన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రికి ఇది దేశంలో 161 ది కాగా, హైదరాబాద్ నగరంలో 7అ వ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి. వాసన్ ఐ కేర్ సిఇఒ డాక్టర్ వికాస్ జైన్ మాట్లాడుతూ, వాసన్ ఐ కేర్ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ప్రతి ఒక్కరికీ, వారి జ్ఞానం మరియు సామాజిక లేదా ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ప్రపంచ స్థాయి నేత్ర సంరక్షణ సౌకర్యాలను అందించడం, ఈ కేంద్రం అన్ని వైద్యులు మరియు పారామెడికల్ సిబ్బందికి శిక్షణా కేంద్రంగా కూడా పనిచేస్తుంది, కాబట్టి మేము తెలంగాణలోని ఇతర నగరాల్లో నాణ్యమైన కంటి సంరక్షణను అందించడం కోసం అన్ని జిల్లాలలో వాసన్ ఐ కేర్ హాస్పిటల్ లను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.

వైద్యం వికటించి ఎనిమిది నెలల బాలుడు మృతి

శోకసముద్రంలో మృతుడి కుటుంబ సభ్యులు
వైద్యుల నిర్లక్ష్యం అంటన్న బాలుడి కుటుంబ సభ్యులు
ఆస్పత్రి ముందు బంధువుల ఆందోళన
దవఖాన యజమాన్యంపై పోలీస్ కేసు నమోదు
హాస్పిటల్ యజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

ఇబ్రహీంపట్నం: ఆగస్టు11 (వాయిస్ టుడే) రవికృష్ణ చిల్డ్రన్ హాస్పటల్ లో ఎనిమిది నెలల బాలుడు మృతి చెందిన సంఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కేంద్రంలో చోటు చేసుకుంది. వైద్యుల నిర్లక్ష్యం వలనే బాలుడు మృతి చెందాడంటు హాస్పటల్ ముందు బంధువుల ఆందోళన చేపట్టారు. కన్నీరు మున్నర అవుతున్న తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు. ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని రాయపోలు గ్రామానికి చెందిన, మహేష్ ప్రవలిక కుమారుడు ప్రజ్వల్ శనివారం తీవ్ర జ్వరం వచ్చిందని హాస్పిటలకు తీసుకొచ్చారు. డాక్టర్ రవికిష్ణ బాలుడికి డెంగ్యూ ఫీవర్ వచ్చిందంటూ తల్లిదండ్రులకు చెప్పడంతో హాస్పిటల్లో అడ్మిట్ చేయడం జరిగింది. హాస్పిటల్ లో అడ్మిట్ చేసుకున్న యజమాన్యం, ఆదివారం ఉదయం టెస్టులు చేయగా ప్లేట్లెట్స్ భారీగా పడిపోయాయని, హైదరాబాదుకు తీసుకెళ్లాలంటూ తల్లిదండ్రులకు చెప్పగా వెంటనే హైద్రాబాదుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో బాలుడు మృతి చెందాడని అన్నారు. శనివారం అడ్మిట్ చేసుకున్న డాక్టర్లు టెస్టులు చేయకుండా నిర్లక్ష్యం చేయటం వలనే బాలుడు చనిపోయారంటూ బందువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రవికృష్ణ హాస్పిటల్ పై మృతుని కుటుంబ సభ్యులు ఆదివారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందని పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపడుతామని తెలిపారు.

కోడిపందాల ముఠాను గుట్టు రట్టు చేసిన బోయినపల్లి పోలీసులు

కంటోన్మెంట్, ఆగస్టు 11 (వాయిస్ టుడే ప్రతినిధి) బోయిన్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కోడిపందాలు నిర్వహిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు.బోయిన్పల్లి లోని వెస్లీ టీచర్స్ కాలనీలో కోడిపందాలు నిర్వహిస్తున్నారన్న పక్క సమాచారంతో దాడులు నిర్వహించిన పోలీసులకు కోడిపందాల ముఠా చిక్కింది. బోయిన్పల్లి ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వెస్లీ టీచర్స్ కాలనీలో ఇంటిని అద్దెకు తీసుకొని స్థానిక ప్రజలతో కలిసి కోడిపందాలకు బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు . ఈ కేసులో 9 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేసినట్టు వెల్లడించారు .నిందితుల నుండి ఏడు సెల్ ఫోన్లు, మూడు నాటు కోళ్లు, 24 కత్తులు, 8000 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు . పోలీసుల విచారణలో ఓ వ్యక్తి స్థానికంగా నివాసం ఉంటూ ఇంటి ఆవరణలో కోడిపందాల నిర్వహిస్తున్నట్టు తెలిసింది. ఈ ముఠాలో సందీప్ ,కృష్ణారావు, ఏడుకొండలరావు, రాజు, రాజ్ కుమార్, నరసింహ, కాజీ నాగభూషణం, వీరబాబులతో కలిసి గత కొన్నాళ్లుగా కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

నియోజకవర్గ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు: మల్‌రెడ్డి రాంరెడ్డి

బోనాల పండుగను పురస్కరించుకొని రోడ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ఎల్బీనగర్ నియోజకవర్గం, కొత్తపేట్ డివిజన్ పరిధిలోని పలు దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని కోరడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలోకాంగ్రెస్ పార్టి నేతలు వజీర్ ప్రకాశ్ గౌడ్, దాచర్లపల్లి శ్రీపాల్ రెడ్డి, వెంకట్రామ్ రెడ్డి, పన్యాల జైపాల్ రెడ్డి, గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి, ముసుకు లోకేష్ రెడ్డి, తోకటి కిరణ్, కారుకొండ శివ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు గొప్ప వరం

ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

శేరిలింగంపల్లి, ఆగష్టు 11(వాయిస్ టుడే) శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న ఇద్దరు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.80 వేల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరమని ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే గాంధీ పునరుద్గాటించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతర సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యాలకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని ఎమ్మెల్యే గాంధీ ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా వైద్య చికిత్స కు సహకారం అందించిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి, బాధితుల కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రసాద్ మరియు తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి, ఆగష్టు 11(వాయిస్ టుడే) కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజు కాలనీ శ్రీ నల్లపోచమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న అన్నవితరణ కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావును సన్మానించారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ అన్నదానం చేయడంలో ఒక పరమార్థంతో పాటు ఆనందం ఉందని అన్న సమర్పణ కార్యక్రమానికి ఆహ్వానించి అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులను చేసినందుకు ఆలయ కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ డివిజన్ అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ మరియు శ్రీను, బాలాజీ , రమణ, వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటీ యవత ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా ఆసక్తి గల రంగాలలో స్థిరపడాలి

కూకట్‌పల్లి జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్

కూకట్‌పల్లి, ఆగష్టు 11(వాయిస్ టుడే) కూకట్ పల్లి నియోజకవర్గంలోని శిల్పా వెన్యూ పరిధిలో కలవరి టెంపుల్ రోడ్డులో చరణ్ రెడ్డి, మహేంద్ర ప్రసాద్, చైతన్య కుమార్, నాగేంద్ర నాయుడు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్సీ ఇటరీ హోటల్ ను ఆదివారం కూకట్ పల్లి జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమకుమార్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా ఆసక్తి ఉన్న వ్యాపార రంగాలలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్, అడబాల షణ్ముఖ, పులగం సుబ్బు, ప్రశాంత్ నాయుడు, శివాంత్ రెడ్డి, సుదీప్, తరుణ్, మన్వేష్ యాదవ్, సాయి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి బాటలు వేస్తా

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ & కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి

ఎల్బీనగర్ ఆగస్టు 11 (వాయిస్ టుడే) మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ పరిధిలోని మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా పవనగిరి కాలనీలో నెలకొన్న సమస్యలను చేయాల్సిన అభివృద్ధి పనులను గ్రేటర్ హైదరాబాద్ బిజెపి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి దృష్టికి కాలనీ సంక్షేమ సభ్యులు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో మిగిలి ఉన్నటువంటి భూగర్భ డ్రెయినేజీ, సి సి రోడ్లు పనులను తొందర్లోనే ప్రారంభిస్తామని,సి.సి రోడ్లు పదేంత లోపు రోడ్ ఫార్మేషన్ కొరకు మట్టిని పంపిస్తానని అన్నారు. కాలనీలో ఒక పెద్ద వృక్షం వలన కరెంట్ ఫ్లెక్సిలేషన్ భూగర్భం నుండి వచ్చే వేర్ల వలన ఒక ఇంటికి ప్రమాదంగా ఉందని అగ్రికల్చర్ ఫారెస్ట్ ఇత్తర డిపార్ట్మెంట్ వారికి సమాచారం అందజేసి అదేవిధంగా ఎలక్ట్రికల్ అధికారులకు కూడా సమస్యను వివరించి తొందర్లోనే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా కాలనీలో మిగిలివున్న సమస్యలను దశలవారీగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సభ్యులు Y. శ్రీనివాస్ రెడ్డి, విష్ణు,ప్రసాద్,శ్రీకాంత్,నరేష్, నర్సింహా,సునీల్,రఘు నాయకులు పారంద సాయి,శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన ఇంటిని తొలగించరూ..

అధికారులు పట్టించుకోవడం లేదు
ప్రాణ నష్టం జరిగితే ఎవరు బాధ్యులు

సికింద్రాబాద్, ఆగస్టు 11 (వాయిస్ టుడే ప్రతినిధి): తార్నాక డివిజన్ లాలాపేట్ లోని సీతారామాంజనేయ భజన సమాజ్ సమీపంలో ఓ ఇల్లు 12-1-139 నంబర్ గల ఇల్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సదరు ఇల్లు ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉంది. ఇదే విషయంపై జిహెచ్ఎంసి అధికారులను సంప్రదిస్తే, టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ఎటువంటి ప్రమాదం జరగకముందే ఆ ఇంటిని తొలగించాలని బస్తివాసులు కోరుతున్నారు.

ర్యాంకుల బాహుబలి, పివిజిఆర్ కే నెంబర్ వన్ ర్యాంకు

సికింద్రాబాద్, ఆగస్టు 11 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సి పి జెట్ (కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్) - 2024 భౌతికశాస్త్రం ఫలితాలల్లో అత్యధిక స్టేట్ ర్యాంకులు సాధించిన పివిజిఆర్ విద్యార్థులు తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచారని పివిజిఆర్ అకాడమి డైరెక్టర్, కన్యమ్ ఫౌండేషన్ సభ్యులు డా. పవన్ కుమార్ అన్నారు. కన్యమ్మ ఫౌండేషన్ వారి ఆర్థిక సహాయంతో ఉచిత శిక్షణ పొందిన విద్యార్థులు, రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించడం తనకి హర్షనీయమన్నారు. 2024 ఆగష్టు 9, శుక్రవారం విడుదలైన భౌతికశాస్త్రం పీజి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో పివిజిఆర్ ఫిజిక్స్ అకాడమీ విద్యార్థులు వరుసగా ఫాతిమా 1, అంజన్న 3, కమల్ ప్రసాద్ 5, పవన్ సాయి 6, రాజేందర్ 7, అఖిల్ 19, శివాని 24, శృతి 30, కవిత 34,తుకారాం 43, అఖిల 50, నితిన్ 54, రాకేష్ 64, ఉపేందర్ 84, పూజ 86, పృథ్వీ 97,అంకిత 103,అఖిల 106, జశ్నవి 166 రాష్ట్ర స్థాయిలో మెరుగ్గైన ర్యాంకులు సాధించారు. మొదటి పది ర్యాంకుల్లో 5, మొదటి 50 ర్యాంకుల్లో 11 మరియు మొదటి 100 ర్యాంకులలో 15 ర్యాంకులతో పివిజిఆర్ ఫిజిక్స్ అకాడమీ వాళ్ళు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి విజయడంకా మోగించారని ప్రస్తావించారు. ఇందుకు సహకరించిన ఫౌండేషన్ సభ్యులకు, ఫిజిక్స్ లెక్చరర్లు సౌజన్య, లావణ్య, డా. మధు, డా. స్వాతి, కృష్ణయ్య, ఇవాంజలి, నాగరాజు, రాజ్ కమల్, భాను ప్రసాద్, డైనమిక్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ (మీర్పెట్), హాస్టల్ వార్డెన్స్ లక్ష్మి , శ్రీకాంత్ లకి, విద్యార్థుల తల్లిదండ్రులకి , విద్యార్థుల కు డా. పవన్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మేరు కుల అభివృద్ధికి ఎన్నికలు నిర్వహించాలి

సికింద్రాబాద్, ఆగస్టు 11 (వాయిస్ టుడే ప్రతినిధి): మెరు సంఘం తెలంగాణ ఆధ్వర్యంలో ఆదివారం అత్యవసర సమావేశం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తూ ప్యానెల్ అధ్యక్ష అభ్యర్థి కీర్తి రాజగోపాల్ మాట్లాడారు. సంఘం వీరప్ప కోర్టులో వేసిన పిటిషన్ పై చర్చ, ఆగస్టు 18 ఎన్నిక ప్యానల్ నియమాలు ప్రకారం పోటీలో సర్వహక్కులు కలిగి ఉన్నామని తెలిపారు. అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో రాష్ట్ర అడాక్ కమిటీ కన్వీనర్ ఆడప వెంకటేశ్వరరావు, కోకన్వీనర్ తాల్ల వెంకటేశ్వరావు, ఉపాధ్యక్షులు గంగా కిషన్, డికొండ నరసింగరావు,ఎస్ బి సంగెవార్, వెంకటేష్, సత్యనారాయణ తో పాటు జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్యానెల్ లోని సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి: జిల్లా కలెక్టర్ శశాంక

రంగారెడ్డిజిల్లా/ఇబ్రహీంపట్నం: ఆగస్టు11 (వాయిస్ టుడే) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం, శంషాబాద్ మండలం, మల్కాపూర్ గ్రామ పరిధిలోని అటవీ శాఖ నిర్వహించిన స్వచ్ఛదనం %-% పచ్చదనం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శశాంక స్థానిక ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటి నీరు పోశారు. ఎమ్మెల్యే, కలెక్టర్ లకు పూలబొకెలతో అటవీ శాఖ అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవకోటి మనుగడకు మొక్కలే ఆధారమని, పర్యావరణ సంరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. సకాలంలో వర్షాలు కురిసేందుకు చెట్లు దోహదపడతాయని, స్వచ్ఛమైన గాలి అందుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి రక్షించాలని ఆకాంక్షించారు.

ఆటవీ ప్రాంతంలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా 224 హెక్టార్ బ్లాక్ లో ఈ సంవత్సరానికి 20 హెక్టార్ లకు గాను 33,500 మొక్కలను నాటాల్సిన లక్ష్యం ఉండగా, ఇప్పటికే 20 వేల మొక్కలు నాటడం జరిగిందని ఆటవీ అధికారులు కలెక్టర్ గారికి తెలిపారు. అదే తరుణంలో ఈ రోజు సుమారు 5 వేల మొక్కలను లక్ష్యంగా పెట్టుకోని మొక్కలను నాటడం జరుగుతుందని అధికారులు తెలిపారు. మిగిలిన మొక్కలను మరో రెండు, మూడు రోజుల్లో పూర్తి చేసే విధంగా చర్యలు చేపడుతామన్నారు.

వనమహోత్సవంలో భాగంగా గత 5 ఏళ్ళ క్రింద నాటిన మొక్కలను నాటిన విధానం, మొక్కల ఎదుగుదల, ప్లాంటేషన్ వివరాలను కలెక్టర్ శశాంక అటవీశాఖ అధికారితో నడకదారిన వెళ్ళి ప్రతి మొక్కలను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు స్వచ్ఛదనం - పచ్చదనం పై నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ శశాంక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు.

బాలాజీనగర్‌లో ఫ్యాషన్ వరల్డ్ బొటిక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి, ఆగష్టు 11(వాయిస్ టుడే) కూకట్‌పల్లి నియోజకవర్గం బాలాజీనగర్ డివిజన్ లోని బాలాజీనగర్ ఓమ్ని హాస్పిటల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన శిరీష రెడ్డి ఫ్యాషన్ వరల్డ్ బొటిక్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా కూకట్ పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మరియు మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు విచ్చేసి రిబ్బన్ కటింగ్ మరియు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ డివిజన్ కార్యదర్శి వెంకటేష్ చౌదరి, సీనియర్ నాయకులు సుభాష్ గౌడ్, అనిల్ కుమార్, రామచందర్, రమేష్, సుశీల్, భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై అవగాహన లేని బండికి ఎమ్మెల్యే కృష్ణారావును విమర్శించే అర్హత లేదు

ప్రధాన కార్యదర్శి బాలాజీ నగర్ వెల్ది వెంకటేష్ చౌదరి

కూకట్‌పల్లి, ఆగష్టు 11(వాయిస్ టుడే) కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలపడమే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు అధికారులను బెదిరించే సంస్కృతి లేదని, పనిచేసే అధికారులకు మద్దతుగా నిలిచి పనిచేపించడమే తెలుసని బీఆర్ఎస్ పార్టీ బాలాజీనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి వెల్ది వెంకటేష్ చౌదరి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిధులను కేటాయించి పనులను ప్రారంభించినప్పటికీ పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడాన్ని సమర్థిస్తూ మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ప్రజాసమస్యలపై ఏ మాత్రం అవగాహన లేదనే విషయం అవగతం అవుతుందన్నారు. ప్రజల మద్దతుతో మూడవ సారి అత్యధిక మెజారిటీతో గెలిచిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురించి ఆయన పనితీరు గురించి ప్రజలకు తెలుసునని, ఓటమి పాలైనా బండి రమేష్ కు కూకట్ పల్లి ప్రజల సమస్యలపై ఏమాత్రం లేదన్నారు. శేరిలింగంపల్లి నుంచి పెద్దమొత్తంలో డబ్బులు ముట్టచెప్పి కూకట్ పల్లిలో పోటీచేసి ఓటమి పాలైయాడని, అప్పటి నుంచి ఏమీ చేయాలో పాలుపోక కూకట్ పల్లిలో అనేక ఏళ్లుగా కాంగ్రెస్ లో ఉన్న నాయకులపై పెత్తనం చెలాయిస్తూ అటు నాయకులను ఇటు అధికారులను బెదిరిస్తున్న బండి రమేష్ నోటికి వచ్చినట్లు మాట్లాడుతూ ఇతరులకు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులు మధ్యలో నిలిచిపోవడం, అదేవిధంగా అసంపూర్తిగా మిగిలిన సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే పై ఆరోపణలు అధికారులకు, ప్రజలకు, నాయకులకు అందరికీ తెలుసునని, కొత్తగా కూకట్ పల్లి లోకి వచ్చిన బండికే తెలియాల్సి ఉందని ఎద్దేవ చేశారు. మూసాపేట మాజీ కార్పొరేటర్ గురించి మాట్లాడే బండి రమేష్ తాను కనీసం వార్డు మెంబర్ గా కూడా గెలువలేదనే విషయం మరిచిపోయా రని, వార్డు మెంబర్ కూడా కానీ బండి రమేష్ కు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనే అర్హత ఎక్కడని, ముందు నీ సంగతి చూసుకో కనీసం వార్డు మెంబర్ గా గెలిచి ఇతరులను విమర్శిస్తే కనీస విలువైన ఉంటుందన్నారు. తగుదునమ్మా అంటూ ఉదయాన్నే లేవగానే పార్టీ కండువా లేనిదే బయటకు రాలేని వారు ఎవరు గుర్తుకూడా పట్టలేని బండి రమేష్ ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో పార్టీ కండువాను వేసుకుని పాల్గొనడం సిగ్గనే విషయాన్ని గుర్తిస్తే మంచిదని సూచించారు



జర్నలిస్టు యోగిరెడ్డి కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలి

టీ జె యు యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఎండి షానూర్ బాబా డిమాండ్

తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం 50 లక్షల ఆర్థిక సాయం అందచేయాలి

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):-వరంగల్ జిల్లాకు చెందిన యువ జర్నలిస్ట్ యోగి రెడ్డి మృతి చెందడం బాధాకరంమని ఆ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం 50 లక్షల ఆర్థిక సాయం అందజేసి కుటుంబాన్ని ఆదుకోవాలని తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ యాదాద్రి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని స్థానిక వినాయక చౌరస్తాలో ముందుగా జర్నలిస్ట్ యోగి రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షులు షానుర్ బాబా మాట్లాడుతూ యువ జర్నలిస్టు యోగి రెడ్డి మృతి చెందడం బాధాకరమైన విషయమని అన్నారు. ప్రభుత్వాలు పాలకులు మారిన జర్నలిస్టు పరిస్థితులు మారటం లేదని ఆ దిశగా ఆలోచించే నాధుడు ఎవరు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమ వృత్తి భద్రత వారి కుటుంబ పరిస్థితులపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అన్నారు. నాటి నుండి నేటి వరకు సొంత ఇల్లు లేక మరణం అనంతరం పార్థివ దేహాన్ని అంతిమ చూపు సైతం చూడలేని పరిస్థితి ఉండటం సమాజంలో ఇంతకంటే విషాదకరమైన పరిస్థితి ఏముంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. యోగి రెడ్డి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు, ఆర్థిక సాయం అందించి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా గౌరవ అధ్యక్షులు చిన్నపత్తిని మధ్యస్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.శ్రీనివాస్, శ్రీనివాస్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో పనిచేసే అధికారులపై స్థానిక ఎమ్మెల్యే ఓర్వలేక అక్కసుతో బద్నాం చేసే ప్రయత్నం

కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్

కూకట్ పల్లి, ఆగష్టు 11(వాయిస్ టుడే) కూకట్‌పల్లి నియోజకవర్గంలో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదంటూ ఎమ్మెల్యే కృష్ణారావు స్పీకర్ ను కలవడం రాజకీయ జిమ్మిక్కు అంటూ కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ఖండించారు. ఎమ్మెల్యే కృష్ణారావు వ్యవహార శైలి అధికారులను బెదిరించే విధంగా ఉందని ఆదివారం రమేష్ ఓ ప్రకటనలో విడుదల చేశారు. అతనికి తన మాట వినని వారందరినీ బెదిరించే అలవాటు ఎప్పటినుంచో ఉందని రమేష్ ధ్వజమెత్తారు. ప్రోటోకాల్ పేరుతో అధికారులపై ఒత్తిడి తెచ్చి అభివృద్ధి పనులు ముందుకు సాగకుండా చేసే ఉద్దేశంతోనే ఇలాంటి డ్రామాలకు తెరలేపాడన్నారు. 10 సంవత్సరాలు అధికార పార్టీలో ఎమ్మెల్యేగా ఉన్న అతను ఎన్నికల ముందు నియోజకవర్గంలో 90 శాతం పనులు పూర్తయ్యాయని పేర్కొన్న కృష్ణారావు ఇప్పుడు మాత్రం అధికారులు పనిచేయడం లేదంటూ విమర్శలకు దిగడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజా సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్న తెలంగాణ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీని అధికారులను బద్నాం చేసే ఉద్దేశంతోనే కృష్ణారావు ఇలాంటి చీప్ ట్రిక్స్ కు పాల్పడుతున్నాడని ధ్వజమెత్తారు. ప్రోటోకాల్ అంటూ యాగిచేసే కృష్ణారావు మూసాపేట్ లో గెలిచిన కార్పొరేటర్ ను పక్కనపెట్టి ఓడిన కార్పొరేటర్ ను వెంటేసుకుని తిరగడం ఏ ప్రోటోకాల్ కిందకి వస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే ఇలా అధికారులను బెదిరించే ధోరణికి దిగుతున్నాడన్నారు. అధికారులు ఇలాంటి బెదిరింపులకు భయపడే అవసరం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిజాయితీగా పనిచేసే అధికారులకు ఎప్పటికీ అండగా ఉంటుందని రమేష్ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ 10 కోట్లు కేటాయించగా ఆ పనులు కొనసాగుతున్నాయన్నారు. నియోజకవర్గంలో పార్కుల అభివృద్ధికి పచ్చదనం కోసం ఇటీవల మరో రూ 10 కోట్ల కేటాయించడం జరిగిందన్నారు. ఈ నిధులతో త్వరలోనే ఆయా పార్కులను అభివృద్ధి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎవరు అక్రమ వసూళ్లకు పాల్పడినా వారిని పార్టీ నుండి సస్పెండ్ చేస్తామని బండి రమేష్ హెచ్చరించారు.

కుటుంబ సమేతంగా యాద"గిరి"గుట్ట ప్రదక్షిణలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- యాదాద్రి భువనగిరి జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి యాదగిరిగుట్టలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్వాతి నక్షత్రం సందర్భంగా కుటుంబ సమేతంగా సామూహిక గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు. ఈ గిరిప్రదక్షిణలో తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుండి ఆలేరు నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ముందుగా పాదాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి,జై బోలో లక్ష్మీనరసింహస్వామి అంటూ,భజనలు చేస్తూ,యధా ఋషి వద్ద నమస్కరించి ఈ గిరిప్రదక్షిణ కొనసాగించారు.

మండలంలో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి

భీమదేవరపల్లి వాయిస్ టుడే ఆగష్టు 11: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి ఆదివారం పర్యటించారు ఆనంతరం ములుకనూరు గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధులు బొజ్జపురి వెంకటయ్యను కలిసారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు అలాంటి పల్లెల్లో సీపీఐ బలమున్న చోట స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను తప్పకుండా నిలబెడుతామని చెప్పారు. గ్రామాల్లో సీపీఐ అభ్యర్థులను గ్రామ వార్డులు, సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్పిటిసీలుగా గెలిపించాలని కోరారు. ప్రశ్నించే గొంతుకలు ఉంటే అభివృద్ధి కార్యక్రమాలు చురుకుగా సాగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో... సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్ కొట్టి పాక రవి తదితరులు పాల్గొన్నారు

యాదగిరిగుట్ట కొండపైన పూర్వ వైభవం తీసుకొస్తాం:- ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్లఐలయ్య

స్వామి వారి అఖండ దీపం ప్రారంభోత్సవం

యాదగిరిగుట్ట కొండపైన పుష్కరిణి ప్రారంభోత్సవం

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట కొండపైన విష్ణు పుష్కరిణి,అఖండ దీపాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రారంభించారు. ముందుగా స్వామివారి వద్ద సంకల్పపూజ చేసి స్వామి వారి పుష్కరిణిలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అనిత,దంపతులు సంకల్ప స్నానం చేశారు. ఆ తర్వాత స్వామి వారి అఖండ దీపంన్నీ ప్రారంభించారు. అనంతరం ఆలయంలో శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి ఆశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు లడ్డు ప్రసాదం అందజేశారు.

పోచమ్మ తల్లి సామూహిక బోనాలలో పాల్గొన్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

పోచమ్మ తల్లి సామూహిక బోనాలలో పాల్గొన్న భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతం శెట్టి వెంకటేశ్వర్లు

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- భువనగిరి పట్టణంలోని అర్బన్ కాలనీలో పోచమ్మ తల్లి సామూహిక బోనాలు పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పోచమ్మ ఆశీస్సులు భువనగిరి పట్టణ పరిసర ప్రాంత ప్రజల పై ఉండాలని అమ్మవారి మొక్కుకున్నారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు,పొత్నక్ ప్రమోద్ కుమార్,తంగెళ్లపల్లి రవి కుమార్. పోలిశెట్టి అనిల్ కుమార్ కడారి వినోద్. కుశంగుల రాజు. జహంగీర్,వస్తుపుల సాయి కిరణ్.హరీష్. జై రామ్. ఎండీ హమీద్. పృద్వి రాజు. శ్రవణ్. వెంకటేష్ పాల్గున్నారు.

ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలేమైనయ్?

అమలు చేస్తామని ఇచ్చిన మాట తప్పుతారా?

తక్షణమే వారికిచ్చిన హామీలను అమలు చేయండి

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

సంజయ్‌కు వినతి పత్రం అందించిన ఆశావర్కర్లు

కరీంనగర్ ఆగస్టు 11(వాయిస్ టుడే)రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కోరారు. దీంతోపాటు ఆశావర్కర్ల సమస్యలపై కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను సైతం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈరోజు మానకొండూరు నియోజకవర్గంలోని తిమ్మాపూర్ లో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాలకు బండి సంజయ్ హాజరప రయ్యారు.8 ఈ సందర్భంగా తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పలువురు ఆశావర్కర్లు బండి సంజయ్ ను కలిసి తమ సమస్యల పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా ఆశావర్కర్లు కనీస వేతనాన్ని రూ.18వేలు చేయాలని, పెండింగ్ పీఆర్సీ ఎరియర్స్, కరోనా రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని 15 రోజులు సమ్మె చేస్తే...దిగొచ్చిన ప్రభుత్వం పలు హామీలిచ్చిందన్నారు. చివరకు సమ్మె కాలపు వేతనం చెల్లింపు మినహా ఇతర హామీలేవీ నేటికీ అమలు కాలేదని వాపోయారు. ఈ అంశంపై ఎన్నిసార్లు ప్రభుత్వం ద్రుష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన బండి సంజయ్ కుమార్ ఆశావర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. దీంతోపాటు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలను కూడా చిత్తశుద్ధితో అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ద్రుష్టికి తీసుకెళ్లి ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి

హుజూరాబాద్ ఆగస్టు 11 (వాయిస్ టుడే): హుజురాబాద్ ఏసిపి శ్రీనివాస్ జీ కుమార్తె వివాహం ఆదివారం హనుమకొండలో జరగగా రాష్ట్ర బీసీ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా నూతన వధూవరులు చక్కటి దాంపత్యాన్ని కొనసాగించాలని,జీవితంలో మరింత ముందుకు వెళ్లాలని వారు ఆకాక్షించారు.

వర్షాకాలంలో సీజనల్ గా వచ్చే విష జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండండి..

ప్రతి ఇంటిలో చెత్త, చెదారం లేకుండా చూసుకోవాలి.

మున్సిపాలిటీలోని పట్టణాలు,గ్రామాల్లో పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టండి.

మిషన్ భగీరథ ట్యాంకులను,గ్రామాల్లో నీటి సరఫరా చేసే ట్యాంకుల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టండి.

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వచ్ఛదనం-పచ్ఛదనం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలి

హుజూరాబాద్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ప్రణవ్ బాబు

హుజూరాబాద్ ఆగస్టు 11 (వాయిస్ టుడే): పట్టణాలు,గ్రామాల్లో పారిశుద్ధంపై, త్రాగునీరుపై, అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని హుజురాబాద్ నియోజవర్గ మున్సిపల్ అధికారులను,మండల ఎం.పి.డి.ఓ అధికారులకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి వోడితల ప్రణవ్ కోరారు. వర్షాకాలం సందర్భంగా మున్సిపల్ పట్టణాలలో, గ్రామాలలో డెంగ్యూ,మలేరియా లాంటి సీజనల్ జ్వరాలు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని,ఆ భాధ్యత హుజురాబాద్ ,జమ్మికుంట మున్సిపాలిటీ. కమిషనర్ లు, ఆయా మండలాల ఎంపిడిఓలు తీసుకోవాలని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ప్రణవ్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు.ప్రతీ ఒక్కరూ ఇంటి పరిసరాల్లో చెత్త,నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలనికోరారు.

అంతేకాకుండా గ్రామాల్లో పారిశుధ్యంపై ఎంపిడిఓలు ఆయా శాఖల అధికారులతో సమన్వయపరుస్తూ ప్రత్యేక దృష్టి పెట్టాలని,మిషన్ భగీరథ ట్యాంకులను,గ్రామాల్లో నీటి సరఫరా చేసే ట్యాంకులను శుభ్రంగా ఉంచుకోవాలనీ ప్రణవ్ సూచించారు.వీలైనంత వరకు ప్రజలకు అవగాహన కల్పించేలా చేయాలనీ కోరారు.వర్షాకాలం ప్రభుత్వం స్వచ్ఛదనం-పచ్ఛదనం కార్యక్రమం పట్ల ప్రజలకు అవగాహనపరచాలని దీన్ని సక్రమంగా అమలు చేస్తే వైరల్ జ్వరాల నుండి బారినపడకుండా ప్రజలు తమ ఆరోగ్యం కాపాడుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆర్థిక సాయం అందజేసిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగుల వంశీ గౌడ్

వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి ఆగస్టు 11: బోయినపల్లి మండలం కోదురుపాక గ్రామానికి చెందిన ఉప్పులేటి హన్మయ్య మరియు వారి కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాగా వారి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు నగదు 10000 సమాకూర్చి ఆ నగదును చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు నాగుల వంశీ గౌడ్ ఇప్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా ప్రెసిడెంట్ కూస రవీందర్ ,బాలగోని శ్రీనివాస్, కత్తెరపాక శ్రీనివాస్ ,నాగుల అంజయ్య, శాలివాన శ్రీనివాస్ ,రాకం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు తూము తీయడానికి వెళ్లి రైతు మృతి

సుల్తానాబాద్, పెద్దపల్లి జిల్లా ఆగస్టు11(వాయిస్ టుడే) సుల్తానాబాద్ మున్సిపల్ పరిధి పూసాల గ్రామానికి చెందిన కంకణాల కొమురయ్య యాభై సంవత్సరాలు ముదిరాజ్ కులస్తుడు, గ్రామానికి చెందిన ఉస్తెం స్వామి లు ఇద్దరూ కలిసి వారి వ్యవసాయ అవసరాల నిమిత్తం ర్యాకల్ దేవ్ పల్లి గ్రామ శివారులోని పెద్ద చెరువు తూము తీయడానికని శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో, చెరువు వద్దకు వెళ్లి తూములో ఉన్న చెత్తాచెదారం తీసివేస్తుండగా ప్రమాదవశాత్తు కంకణాల కొమురయ్య చెరువు నీటి ఒత్తిడికి తూములో ఇరుక్కుపోయి నీటిలో మునిగి చనిపోయాడని మృతుడి భార్య కంకణాల స్వరూప ఇచ్చిన దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జూలపల్లి ఎస్ ఐ శ్రీధర్ తెలిపారు. మృతునికి ఒక కొడుకు, ఇద్దరు కూతుర్లు సంతానం ఉన్నారు..

విద్య వైద్యంపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి

వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి ఆగస్టు 11: రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం నీలోజు పల్లి లో బిగ్ టివి అధ్వర్యంలో చేబట్టిన మెగా హెల్త్ క్యాంపు కి అపూర్వ స్పందన వచ్చింది.. ప్రజలు పెద్ద ఎత్తున హెల్త్ క్యాంపు కి వచ్చి టెస్ట్ లు చేసుకున్నారు..కరీంనగర్ వన్ హాస్పిటల్ అధ్వర్యంలో వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందుల పంపిణి చేసారు... ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై మెడికల్ క్యాంపు ప్రారంభించారు. మెగా హెల్త్ క్యాంపు నిలోజిపల్లి మాజీ సర్పంచ్ ముంపు గ్రామాల ఐక్యవేదిక అధ్యక్షులు కూ స రవీందర్ సహకారం అందించారు.

అనంతరం ఎమ్మెల్యే మేడిపల్లి సత్య మాట్లాడుతూ వన్ హాస్పిటల్ బిగ్ టీవీ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు ప్రస్తుత వర్షాకాలంలో ఇలాంటి హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారికి కావాల్సిన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపించడం అభినందనీయమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా వైద్యానికి పెద్ద పీట వేస్తున్నారని అన్నారు.టిఆర్పీ రేటింగ్ ల కొసం అరాటపడే మీడియా సంస్థలకి భిన్నంగా గ్రామీణ ప్రాంతాల ప్రజల అరోగ్యం ముఖ్యమని బిగ్ టివి మెగా వైద్య శిబిరాలు నిర్వహించడం గొప్ప విషయామని ప్రశంసలు అందజేసారు...మెగా హెల్త్ క్యాంపు కి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. హెల్త్ క్యాంపు హాజరైన మేడిపల్లి సత్యం బిగ్ టీవీ స్టాప్ రిపోర్టర్ శ్రీనివాస్ జిల్లా వైద్యాధికారి వసంతరావు లను కూస రవీందర్ మెమోంటోటలతో సత్కరించారు. అనంతరం జిల్లా వైద్యాధికారి వసంతరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు అలాగే సిరిసిల్ల వేములవాడలోని ప్రభుత్వ దవాఖానాలో అందజేస్తున్న సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వసంతరావు ,మాజీ ఎంపీపీ , ముంపు గ్రామాల ఐక్యవేదిక అధ్యక్షులు, కాంగ్రెస్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు కూస రవీందర్ వేణుగోపాల్,భీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి,మాజి జెడ్పీటీసీ పులి లక్ష్మి పతి, కాంగ్రెస్ నాయకులు సంబ లక్ష్మి రాజం,బాలగొని శ్రీనివాస్ ,ఏనుగుల కనకయ్య ,నాగుల వంశి, బొయిని ఎల్లెష్ యాదవ్ ఉయ్యాల శ్రీనివాస్ , అనుముల హరి కృష్ణ,శాలి వాహన శ్రీనివాస్ ,మాజి ప్రజాప్రతినిధులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీజనల్ వ్యాదులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

పరిసరాలు సుభ్రంగా ఉంచుకునేల అవగాహన కల్పించాలి

జిల్లా వైద్యాధికారి వసంతరావు

వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి ఆగస్టు 11: వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి వసంతరావు వైద్యులకు సిబ్బందికి సూచించారు. బోయినపల్లి మండలం, నీలోజుపల్లిలో జరిగిన మెగా హెల్త్ క్యాంపు హాజరైన జిల్లా వైద్యాధికారి వసంతరావు హెల్త్ క్యాంప్ అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడారు. వర్షాకాలం కావడంతో గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.అనారోగ్యం బారిన పడకుండా ఉండాలంటే ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా నీటి నిలువ లేకుండా ప్రజలకు అవగాహన కలించాలని తెలిపారు. ఆశా వర్కర్లు ఏఎన్ఎం లు గ్రామాల్లో తిరుగుతూ జ్వరాల బారిన కుటుంబాలను గుర్తించాలని వారికి వైద్య సేవలు అందించాలని అన్నారు.

సదయ్య గౌడ్ కు ఘన సన్మానం

సుల్తానాబాద్ పెద్దపల్లిజిల్లా ఆగస్టు11(వాయిస్ టుడే) భవన నిర్మాణ కార్మికుడు ఏగోలపు సదయ్య గౌడ్ ను ఘనంగా సన్మానించడం జరిగింది ఆదివారం వేములవాడ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సదయ్య గౌడ్ గత ఇరవై సంవత్సరాలుగా చేస్తున్న సేవలను గుర్తించి అభినందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏ గోలపు కుమార్ గౌడ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో తాను సంపాదించిన సంపాదనలో కొంత భాగం పేదలకు అందించి ఆదర్శంగా నిలవడంతో తమిళనాడు ఊటీ లో డాక్టరేట్ అందుకోవడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు సుంకపాక గంగారం, చంద్రగిరీ అంజి,బండి శివ,కందూరి సత్యలింగం,ముల్కల భాస్కర్, కడపాల పరశురాం, లాల బాబు, కందూరి గణేష్, వడ్డేటి రవి, కందూరి చంద్రలింగం, సుంకపాక శ్రీనివాస్, దొబ్బల కిరణ్, మేడిపల్లి రవి,ఆరింద సింటు,అరేపల్లి హరీష్, పండుగ శంకర్, లతోపాటు తదితరులు పాల్గొన్నారు..

ఘోర రోడ్డు ప్రమాదం ఇద్దరు మృతి..!

పెద్దపల్లి జిల్లా ఆగస్టు.11 (వాయిస్ టుడే) గోదావరిఖని: ఎద్దపల్లి జిల్లా గోదావరిఖని సమీపంలోని గంగానగర్ రహదారిపై అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని షాపింగ్ మహల్ లో పనిచేసే ఇద్దరు ఉత్తరప్రదేశ్ కు చెందిన యువకులు తమ ద్విచక్ర వాహనంపై గోదావరిఖని కి వస్తున్నారు. వెనుకగా వచ్చిన లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటన స్థలాన్ని స్థానిక వన్ టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి పరిశీలించి, కేసు నమోదు చేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రము ఆలీగార్డ్ కి చెందిన దేవా దత్ నాయక్ 28 సం: మరియు సత్యేంద్ర నాయక్ 19. సం: అనువారలు మంచిర్యాలలోని సిఎంఆర్ షాపింగ్ మాల్ ముందు శుభకార్యాలకు మెహేంది వేస్తూ జీవనం సాగిస్తున్నారు మంచిర్యాల గోదావరిఖని .10 తారీకు రోజున 8వ కాలనీ నందు గల ఒక వివాహ వేడుక లో (గోరింటాకు) మెహేంది వేసి మోటార్ సైకిల్ పై వస్తుండగా. అర్ధరాత్రి 12 ప్రాంతంలో జిఎం కాలనీ గంగానగర్ నుండీ మంచిర్యాలకు వెళ్ళుచుండగా ఒక లారీ డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడుపుకుంటూ మోటార్ సైకిల్ కి ఢీకొట్టగా వారు అక్కడికక్కడే మృతి చెందినారని వన్ టౌన్ సిఐ తెలిపారు.సి ఎం ఆర్ షాపింగ్ మాల్ యొక్క మేనేజర్ అయిన సృజన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని లారీని డ్రైవర్ను పట్టుకున్నారు

రెవెన్యూ ఉద్యోగులు ప్రభుత్వానికి కళ్ళు చెవులు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

కరీంనగర్ ఆగస్టు 11(వాయిస్ టుడే)తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతిపాదించిన నూతన ఆర్ఓఆర్ ముసాయిదా బిల్లుపై తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించడం జరిగింది. ప్రభుత్వం ప్రతిపాదించిన ముసాయిదా బిల్లుపై వివిధ వర్గాల తో చర్చించి ప్రజలకు పట్టాదారులకు రైతులకు మరింత మేలు జరిగే విధంగా చట్టం రూపకల్పంలో సహకరించాలనే లక్ష్యంతో నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి ద్వారా రైతులు ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని అదేవిధంగా రెవెన్యూ వ్యవస్థను గత ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని తెలియజేశారు కొత్త రెవెన్యూ చట్టం ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం చూపే విధంగా ఉండాలని అదేవిధంగా రెవెన్యూ ఉద్యోగులు ప్రభుత్వానికి కళ్ళు చెవులు గా ఉంటారని గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థను కూడా పటిష్టపరిచి ఒక మంచి చట్టం ద్వారా తెలంగాణ ప్రజలకు మేలైన సర్వీసులు అందిస్తామని తెలియజేశారు. ట్రెసా ప్రయత్నాన్ని అభినందిస్తూ వారందించే సూచనలు అన్నింటిని ప్రత్యేకంగా ముఖ్యమంత్రి దృష్టికి రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి అవన్నీ చట్టంలో పొందుపరిచేలా తాను ప్రయత్నిస్తానని తెలియజేశారు. ల అతిథులుగా పాల్గొన్న మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ శ్రీ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ నూతన రెవెన్యూ చట్టంలో పొందుపరచవలసిన వివిధ అంశాలను మరియు రైతులకు పట్టాదారులకు అందించవలసిన సర్వీసులను వివరించారు.

14 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

జమ్మికుంట ఆగస్టు 11 (వాయిస్ టుడే): జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్ గ్రామంలో ఆదివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో కానిస్టేబుల్ షణ్ముఖరావు, హెంగార్డు సతీష్ లు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా బియ్యం మూటలు వేసుకుని రావడం చూసి వారిని ప్రశ్నించగా వారు గ్రామాలలో రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఇక్కడ ఒకచోట నిలువ చేసుకున్నామని తెలుపగా ఆ స్థలానికి వెళ్లి అక్రమంగా నిల్వ ఉంచిన 14 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.అక్రమ రవాణాకు పాల్పడిన బండారి స్వామి, రేవెల్లి కుమార్ ల పై కేసు నమోదు చేశారు.

మృతుల కుటుంబాలను కలిసి సానుభూతి తెలిపిన కేంద్ర మంత్రి బండి సంజయ్

హుజూరాబాద్ ఆగస్టు 11 (వాయిస్ టుడే): హుజూరాబాద్ పరిధిలోని ఇప్పల నర్సింగాపూర్ లో ఇటీవల మరణించిన బిజెపి నాయకుడు పల్లె శ్రీనివాస్ గౌడ్ కుటుంబాన్నీ కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదివారం రాత్రి పరామర్శించి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే బిజెపి నాయకుడు గొట్ట రవీందర్ తల్లి ఇటీవల అకాల మరణం చెందారు.వారి కుటుంబాన్ని సైతం పరామర్శించి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి,పట్టణ అధ్యక్షులు గంగిశెట్టి రాజు, బిజెపి నాయకులు తదితరులు ఉన్నారు.